

# పిక్నిక్

## యస్. యోగబ్రహ్మం

ఆఫీస్ రిక్రియేషన్ క్లబ్ తరపున ఒక పిక్నిక్ ఏర్పాటు చెయ్యాలని చాలా కాలంగా అనుకుంటున్నారు. ఆ విషయం చర్చించటానికి సాయంత్రం మెంబర్లంతా సమావేశమయ్యారు. వాళ్ళలో లేడీస్ కూడా ఉన్నారు

బిస్కట్లు తింటూ టీ సేవిస్తూ పిక్నిక్ గురించి అతితా హుషారుగా మాట్లాడుకుంటున్నారు. పిక్నిక్ కాస్త థ్రిల్లింగ్‌గా వుండాలని కొందరు అభిప్రాయపడ్డారు. అలా అయితే ఆ ప్రదేశం ఒక అడవి మధ్యలో ఉంటే బాగుంటుందని మరి కొందరన్నారు. అక్కడో కోవెల ఉంటే కాస్త పుణ్యం కూడ మూటకట్టుకోవచ్చని కొందరి కోరిక. అక్కడ పేకాడటానికి వీలుంటే కాలక్షేపంగా ఉంటుందని మరి కొందరి సూచన. సుందర దృశ్యాల్ని ఫోటోలు తీయటానికి కెమెరా ఉంటే బాగుంటుందని మరొకరి సలహా.

ఇంతకీ అలాంటి ప్రదేశమేదైనా ఉందా అని కొందరు సందేహం వెలిబుచ్చారు. చంద్రమోహన్ 'కైలాస కొండ' పేరు సూచించాడు. ఆ పేరు వినగానే సభ్యులందరిలో ఉత్సాహం ఉరకలు వేసింది. అక్కడ ఒక శివాలయం కూడ ఉంది. అది జనసంచారం లేని ప్రదేశం. గలగల పారే సెలయేళ్ళతో, మేఘాల నంటే పర్వతాలతో అక్కడ ప్రకృతి రమణీయంగా ఉంటుంది.

క్లబ్ సెక్రటరీ పిక్నిక్ ఎలా వుంటే నచ్చుతుందో స్త్రీల అభిప్రాయం కోరగా, రామలింగం అడ్డువచ్చి "అక్కడో చీరల కొట్టు స్టీలు సామాను అమ్మే దుకాణం కూడ ఉండాలి" అన్నాడు.

క్లబ్ సెక్రటరీ "నువ్వు స్త్రీవా?" అనే సరికి అంతా గొల్లున నవ్వారు.

లేడీస్ కూడ పిక్నిక్ స్పాట్

విషయంలో మిగతావాళ్లతో ఏకీభవించారు.

ఐతే పిక్నిక్‌లో పాల్గొనే విషయంలో చంద్రమోహన్ అభ్యంతరం తెలిపాడు. అలా తమను వెలివెయ్యడం సహించని లేడీస్ తాము మగవాళ్ళకంటే ఎందులో తక్కువో చెప్పమని నిలదీశారు.

"అది భయంకర కీకారణ్యం. పులి వస్తే కనీసం మీకు చెట్టెక్కడమైనా తెల్సి వుండాలి" అన్నాడు చంద్రమోహన్.

"చెట్టెక్కడమేనా? ఈ రోజుల్లో లేడీస్ ఎవరెస్ట్ కూడ ఎక్కుతున్నారు. కుమారి బచేంద్రిపాల్ గురించి మీకు తెలీదా?" అంది కళ్యాణి.

"యస్..యస్ లేడీస్ నో ఎ'వరస్ట్' ఎక్కడం" అన్నాడు సుబ్బారావు.

"గురూ! ఎవరెస్టు శిఖరానికి మెట్లుంటాయా?" కుతూహలంగా అడిగాడు బుచ్చిబాబు.

"మమ్మల్నేం ఎగతాళి చెయ్యక్కరలేదు. మేము కూడ పిక్నిక్ రావడం ఖాయం" అంది సావిత్రి.

"మేము తల్చుకుంటే సప్తసముద్రాలైనా దాటగలం" అంది కళ్యాణి

ఆడవాళ్ళు పట్టినపట్టు వదల్లేదు. తాము ఎలాంటి కష్టాలైనా ఎదుర్కొని పిక్నిక్‌లో పాల్గొని క్షేమంగా తిరిగి రాగలమని, కావలిస్తే పందెం కాయమన్నారు.

అంతదాకా వచ్చాక చంద్రమోహన్ వెనక్కి పోదల్చలేదు. "కానివ్వండి, పందెమెంత?"

"వెయ్యి రూపాయలు!" కళ్యాణి ఉద్రేకంగా అంది. చంద్రమోహన్ సరేనన్నాడు.

* * *

చీకటి పడబోతోంది. కళ్యాణి, సావిత్రి, శ్యామల, అలివేలు ఇళ్ళకు వెడుతూ ఒక్కొక్కరు రెండు వందల యాభై రూపాయలు తమవాటా పందెంగా ఒప్పుకున్నారు వాళ్ళ కబుర్లలో అంత తేలికైన పందెం మరొకటిలేదని, గెలుపు ఖాయమని హుషారుగా చెప్పుకున్నారు, ఇక పందెంలో గెల్చుకునే డబ్బు ఎలా ఖర్చుచేయాలో నిర్ణయించుకోవడానికి వాళ్ళకు ఎక్కువసేపు పట్టలేదు 'పేటీ ఎంపోరియం' అని నియోన్ లైట్లతో వెలిగిపోతున్న ఒక సైన్‌బోర్డు వాళ్ళనాకర్షించింది.

మెట్లవద్ద తచ్చాడుతున్న వాళ్ళను చూచి కొట్టు యజమాని "రండమ్మా, లోపలికి రండి! లేటెస్ట్ ఫ్యాషన్లో అద్భుతమైన చీరలు వచ్చాయి" అంటూ ఆహ్వానించాడు. లోపలికి వెళ్ళటానికి సందేహిస్తుంటే వాళ్ళ సందేహానికి కారణం పసిగట్టినట్లున్నాడు. "రండమ్మా! మిమ్మల్ని చీరలు కొనమని అనటంలేదు. మీలాంటివారు మా కొట్టుకు రావటం అదృష్టం. లోపలికి వచ్చి ఒకసారి ఏమేమి వెరైటీస్ ఉన్నాయో చూడండి" అంటూ స్టీలు స్టూళ్ళను హడావిడిగా

లాగాడు. "సుబ్రమణీ! గుండూరావ్... హైక్లాస్ లేడీస్ వచ్చారు. 'ఏ-వన్' చీరలు చూపండిరా. కంచి, మధురై, సేలం, అరణి, బెనారస్..." అని కేకలు వేశాడు నలుగురూ ఒకరి వెంట ఒకరు లోపల అడుగుబెట్టారు. "కూర్చోం డమ్మా, కూర్చోండి" యజమాని వినయంగా వాళ్ళను కూర్చోబెట్టాడు.

"మీకే రకం చీరలు కావాలండీ" అన్నాడు సేల్స్‌మాన్ మామూలు ధోరణిలో. "అన్ని వెరైటీలు చూపరా" అని అసహనంగా అరిచాడు యజమాని ఆ సేల్స్‌మాన్ గాజుబీరువాల వద్దకు వెళ్ళాడు. రెండో సేల్స్‌మాన్ "మీ చీరెంతండీ? చాలా బాగుంది!" అన్నాడు కళ్యాణిని నిలువెల్లా ఆశ్చర్యపోయి చూస్తూ.

యజమాని దూరం నుంచి ఆ మాటలు విని కొంపలంటుకుపోతున్నట్లు పరుగెత్తుకొచ్చి "వాళ్ళ చీరల్ను కాదురా చూడ్డం. మన చీరలు చూపండిరా- ఇలాంటి వెధవల్ని పెట్టుకుంటే వ్యాపారం దివాలా తీసేలా వుంది" అని కసురుకున్నాడు.

ఒక సేల్స్‌మాన్ చకచకా బీరువాలోని చీరల్ని బయటికి తీసి బల్లమీద పడేస్తుంటే, రెండో సేల్స్‌మాన్ వాటి పేర్లు, ప్రసిద్ధి, వెల చెప్పుకుపోతున్నాడు.

అప్పటికి నాలుగు బీరువాలు ఖాళీ అయి చీరలు బల్లలమీద చిందరవందరగా పడివున్నాయి. ఆ నలుగురి కళ్ళకు ఒకదాన్ని మించి మరోటి అందంగా కనిపించసాగాయి. సెలక్షన్ ఎంతకూ పూర్తికాలేదు. సేల్స్‌మాన్ చివరి బీరువాలోంచి చీరలు బయట పడేస్తుంటే బట్టలు కొనడానికి ఎవరో లోపల అడుగు బెట్టి "దుకాణం ఖాళీచేస్తున్నట్టుంది. బిల్డింగు మారుస్తున్నారేమో!" అంటూ మెట్లు దిగిపోతుంటే యజమాని "అబ్బే, లేదండీ" అంటూ అతన్ని బ్రతిమాలి మళ్ళీ కొట్లోకి తీసుకొచ్చి సేల్స్‌మాన్‌కు అప్పగించాడు.

"ఇవి ట్వంటీఫస్ట్ సెంచరీ చీరలండీ" అంటూ కొట్టు యజమాని కొన్ని చీరలు చూపించాడు.


"ఇది ట్వంటీయత్ సెంచరీనే కదండీ" అంది అలివేలు.

"రాబోయే సెంచరీలో ఆడవాళ్లు ఇప్పుడే వుపయోగించేశారండీ" అన్నాడు యజమాని సంజాయిషీగా.

కొట్టు యజమాని ఒక చీర చూపించి ఫలానా సినిమాలో "శ్రీదేవి ఈ చీరే కట్టింది" అన్నాడు.

"ఇది సెకండ్ హేండా?" అని శ్యామల అనుమానం వ్యక్తంచేస్తుంటే కళ్యాణి ఆమె నోరు మూసింది.

కొట్టు యజమాని మరోచీర చూపిస్తూ "ఈ చీర చూడండి. ఎంత హుందాగా వుందో! మధ్యాహ్నం జిల్లా అధికారిగారి శ్రీమతి రెండు ప్యాక్ చేయించు కెళ్ళింది" అన్నాడు.




"రెండెందుకండీ? ఒకటి చాలదూ? అవి హాఫ్ శారీసా?"

"లేదు. ఆవిడ డబుల్ శార్త్రి" అని పేల్సుమాన్ అనేసరికి కొట్టు యజమాని అతనిపై విరుచుకుపడ్డాడు.

"ఇవి లేటెస్ట్ చీరలండీ. వీటిని 'స్టార్ వేర్స్' అంటారు. వీటిలో వెరైటీని చూడండి ఇది వయ్యారిభామ. ఇది బంగారు పతకం. ఇది స్వయంవరం. ఇది త్రీ-డీ!"

"త్రీ-డీనా?"

"ఔనండీ. కొట్టొచ్చినట్టు కనబడు తుంది."

"ఇలాంటి చీరలు కడితే మా ఆయన ఊరుకోరు" అంది అలివేలు.

"వూరుకోవే" గిల్లింది కళ్యాణి.

కొట్టు యజమాని మరో చీర విశా లంగా తెరిచి చూపిస్తూ "బోర్డరు చూడండి ఎంత అందంగా ఉందో! మీ లాంటి ఎట్రటి అమ్మాయిలకు సరిగ్గా మాచ్ అవుతుంది."

"ఇది బాగున్నట్లుంది" అరచేతిలోనికి తీసుకొని పట్టి చూచి సంతృప్తిపడ్డారు వాళ్ళు

"హమ్మయ్య!" అనుకున్నాడు కొట్టు యజమాని.

"దీని పేరేమిటండీ?" అంది శ్యామల.

'చింతకాయ పచ్చడి' అని మనసులో అనుకుని, పైకి మాత్రం "క్లియోపాత్ర" అని చెప్పాడు.

"ఈ క్లియోప్రాత వెల చెప్పండి" అంది అలివేలు.

"రెండువందలా అరవైరూపాయలు!" అన్నాడు కొట్టు యజమాని.

"రెండువందలా ఏభైకివ్వరా?"

"సరే! మీరు కాబట్టి ఒప్పుకుంటున్నా.

కాని ఒక్క షరతు. ఎవరైనా అడిగితే మాత్రం దయచేసి రెండువందలా అని వై అని మాత్రం చెప్పండి. అందరికీ మీకిచ్చిన వెలకే ఇవ్వాలంటే కుదరదు."

"చూడండి. ఈ చీరలు నాలుగు కావాలి. అట్టిపెడితే వారం రోజుల్లో మాకు బోనస్ వచ్చాక కొంటాం."

"పట్టుకుపొండమ్మా- డబ్బు కేం తొందర! మీ మీద నాకు నమ్మకముంది- ఒరేయ్ సుబ్రమణీ! ఈ నాలుగు చీరలూ పాక్ చెయ్యి!"

యజమాని బిల్లు రాసి యిచ్చాడు. కళ్యాణి తన ఆఫీసు అడ్రసు అతడికి చెప్పి పాకెట్ అందుకుంది.

"కొట్టు యజమాని ఎంత మంచి వాడు!" అంది అలివేలు మెట్లు దిగుతూ. మిగతావాళ్ళు అవునని తలవూపారు,

"బోనస్ అన్నావేమిటి? మనకు బోనస్ లేదుగా!"

"పందెం డబ్బులు బోనస్ కాదా?" అంది కళ్యాణి నవ్వుతూ. అందరూ తృళ్ళిపడుతూ నవ్వుకున్నారు.

* * *

పిక్నిక్ రోజు అంతా ముచ్చటగా ముస్తాబై వచ్చారు. ప్రతి వొక్కరిలో వుత్సాహం, ఆనందం తొంగిచూస్తోంది ఆడ, మగ తేడాలేకుండా కలసిమెలసి ఒకరికొకరు సహాయపడుతూ మసలుకుంటున్నారు. సావిత్రి పైట గాలికి రెపరెపలాడుతూ అవస్థ పెడుతుంటే బుచ్చిబాబు ఒక పిన్ను అందించాడు. ఆమె 'థ్యాంక్స్' అని చిరునవ్వుతో తీసుకొని పైట జారిపోకుండా జాకెట్టుకు గుచ్చుకుంది. కబుర్లు చెప్పుకుంటూ కొద్దిపాటి సరంజామాతో నడక సాగించారు.

కొంత దూరం వెళ్ళాక అడవి ప్రారంభమైంది. మొట్టమొదట వాళ్ళకు ఒక కుందేలు స్వాగతం చెప్పింది. అది తుర్రున రోడ్డుకు ఒక వైపునుండి మరో వైపుకు పరుగెత్తింది. అంతా దాన్ని చూసి ముచ్చటపడ్డారు. ఇంతలో ముందు వెడుతున్నతడు హఠాత్తుగా ఆగిపోయి "ఇదుగోండి పాము వెళ్ళిన జాడ!" అన్నాడు.

"ఏదీ, ఎక్కడ?" అంతా పరుగెత్తుకొచ్చారు.

"ఇదుగోండి. పాము యిటువేపు చెట్లలోనికి వెళ్ళింది. జాడ చూడండి. ఎంత స్పష్టంగా వుందో!"

అంతా తలలూపారు.

ఆ తరువాత పాముల గురించి మాట్లాడుకోసాగారు. కొందరు పాముల గురించి తమ అనుభవాలు చెప్పారు

"కొన్ని పాములు మనుషులుగా కూడ మారుతాయి" అన్నాడు బుచ్చిబాబు.

అంతా గొల్లున నవ్వారు.

"లేదండీ. ఒక నవలలో వ్రాశారు!" అన్నాడు కళ్ళు పెద్దవిచేసి.

"గురూ! నంబర్ వన్‌కి వెళ్ళివస్తాను. మీరు వెడుతూ వుండండి" అని చెట్ల

చాటుకు వెళ్ళారు కాశీపతి.

మరుక్షణం "బాబోయ్! దెయ్యం!" అని ఒక్క గావుకేక పెట్టాడు. అంతా అటు చూశారు. ఒక నల్లని ఆకారం తెల్లని పళ్ళు ఇకిలిస్తూ గొడ్డలి పైకెత్తి చెట్ల చాటునుండి బయటికి వచ్చింది.

ఆడవాళ్ళు మగవాళ్ళ వెనక్కి సర్దుకున్నారు. కాశీపతి వణికిపోతున్నాడు.

"గురూ! అది దెయ్యం కానట్లుంది. రాక్షసుడేమో!" మెల్లగా అన్నారొకరు.

ఆ ఆకారం హుంకరించింది. ఏదో గద్దించి అడిగింది. ఆ భాష ఎవ్వరికీ అర్థంకాలేదు. గుంపును చూచి ఆ ఆకారం పళ్ళు కొరుకుతూ వెళ్ళిపోయింది.

"చెంచువాడులా గున్నాడు. వాడు గూడేనికెళ్ళి తన మనుషుల్ని తెచ్చేలోగా మనం దూరంగా వెళ్ళడం మంచిది" అని నడక వేగం హెచ్చించారు.

ముందుకు వెళ్ళేకొద్దీ దారి స్పష్టంగా లేదు. అన్నీ చెట్లు, పొదలు, ముళ్ళు. చాలా దూరం వెళ్ళాక కాళ్ళు పీకుతున్నాయని కొందరనేసరికి ఒక అరగంట విశ్రాంతికోసం ఒక చెట్టుకింద దుప్పట్లు పరచి కూచున్నారు.

చెట్టుకింద ఒక పుట్ట వుంది. ఆ పుట్టలో పాము వుందని కొందరు, లేదని కొందరు వాదించారు.

బుచ్చిబాబు "నాగదేవత మీద లేడీస్ ఒక గ్రూప్‌సాంగ్ పాడండి. పుట్టలో పాము బయటికి వస్తుంది" అన్నాడు.

"ఆ గోలకా? పాపం! దాన్ని వదిలెయ్యండి" అన్నాడు రామలింగం.

ఆడవాళ్ళు చురచురా చూశారు.

చాలమంది ప్రతిమాలాక శ్యామల ఒక సినిమాపాట పాడింది.

అంతా మెచ్చుకుంటూ చప్పట్లు చరిచారు.

కొంచెంసేపటికి అంతా లేచారు. దుప్పట్లు, పరంజానూ సర్దుకుని నడక సాగించారు. అలా చాలదూరం నడిచాక ఒక ఏరు ఎదురైంది.

"కళ్యాణిగారూ! పదండి" అన్నాడు చంద్రమోహన్.

కళ్యాణి ఏటివంక చూస్తూ నిలుచుంది. ఏరు నిండుగా ప్రవహిస్తోంది.

"ఎక్కడికి?" అంది శ్యామల.

"ఏట్లోకి. ఇదే దారి!"

"మీరు మొదట ఏరుందని చెప్పలేదే?" కళ్యాణి నిస్సహాయంగా అంది.

"సప్తసముద్రాలు దాటుతామన్నారుగా. ఏరు ఒక లెఖ్ఖా అని చెప్పలేదు."

కళ్యాణి ఇబ్బందిగా ముఖంపెట్టింది.

"ఏటి వెంబడి వెడితే ఎక్కడో ఓవర్‌బ్రిడ్జి ఉంటుంది" అంది సావిత్రి.

కళ్యాణి ముఖం వికసించింది.

"మీ తెలివికి నా జోహార్లు. కానీ ఇక్కడ అలాంటిదేమీ లేదు" అన్నాడు చంద్రమోహన్.

"ఎంత లోతుంటుంది?" అంది కళ్యాణి హీనస్వరంతో.

"నాకు బహుశా తొందరలోను రావచ్చు. మీకైతే..."

కళ్యాణి కోపంగా చూసింది.

"మీరెలా వెళతారు?" అంది శ్యామల.

"ఇలా..." అంటూ చంద్రమోహన్ అండర్‌వేర్‌తో ఏట్లోకి దిగి, "రండర్రా!" అని తన బృందాన్ని కేకేశాడు. అందరూ ట్రౌజర్లు భుజాన వేసుకొని తమవెంట తెచ్చిన బ్యాగ్స్ భుజాలకు తగిలించుకొని ఏట్లోకి దిగారు. గట్టున వున్న నలుగురు ఆడవాళ్ళకేసి చేతులూపుతూ "పందెం గెలిచాం. వెయ్యి రూపాయలు! మేము వెడుతున్నాం. టాటా!" అని ముందుకు కదిలారు.

కళ్యాణి బృందానికి ఏడుపు వచ్చినంత పనైంది. వాళ్ళ కళ్ళముందు క్లియోపాత్ర చీరలు కదిలాయి. కొట్టువాడు బాకీ వసూలుకు మరుసటి రోజు వస్తాడేమో! బలవంతంగా తమచేత చీరలు కొనిపించిన కొట్టు యజమానిని, తమను అన్యాయంగా రెచ్చగొట్టి ఈ పందెంలోకి దింపిన చంద్రమోహన్ని కాసేపు తిట్టుకున్నారు. ఎలాగైనా పందెం గెలవాలి. చివరికి ఒక నిర్ణయానికి వచ్చారు. చప్పట్లు చరిచి చంద్రమోహన్ బృందాన్ని పిలిచారు.

ఆ సమయానికి మగవాళ్ళు ఏటి మధ్యన వున్నారు.

"నీటిమట్టం వాళ్ళు చెప్పినంతవరకూ వస్తుంది" అంది శ్యామల.

మగవాళ్ళు వెనుదిరిగి ఒడ్డుకుచేరి "ఎందుకు పిలిచారు?" అన్నారు.

"పందెం మేము ఓడతామని ఎవరన్నారు?"

"మేమే!" అన్నారు ఒకరి ముఖాలొకరు చూసుకుంటూ.

"మీరు ముందుగా చెప్పివుంటే ప్పేరుగా బట్టలు తెచ్చుకునేవాళ్ళం" అంది సావిత్రి

"చెప్పకపోవటం మా తప్పుకాదు. మాకు కూడ బట్టలు లేవే!"

"మీకు సిగ్గులేదు!"

"అదెక్కడ దొరుకుతుందండీ? కిలో ఎంత?" అడిగాడు బుచ్చిబాబు అమాయకంగా.

"సిగ్గు కొట్లో అమ్మరు. అదేమైనా చింతపండా?" అన్నాడు సుబ్బారావు.

"మేము కూడ ఏట్లోకి దిగుతున్నాం. పందెం మేము ఓడదల్చలేదు" కళ్యాణి అంది. అయితే ఆమె చూపుల్లో భయం తొంగిచూస్తోంది.

"బట్టలు తడుస్తాయండీ."

"తడవనీ."

"చూడండీ మేము పందెం ఓడము గాక ఓడము. మీరు ముందుగా బయల్దేరి వెళ్ళండి. మేము బట్టలు తడవకుండా తరువాత వస్తాము" అంది అలివేలు.

"మీకు ఈ విషయం తెలియదనుకుంటా. అదేనండీ...బందిపోటు ముఠా నాయకుడు గబ్బర్‌సింగ్ బ్రదరు గాభరా



వింగ్ స్థావరం ఇక్కడెక్కడో ఉన్నట్లు పేపర్లో చదివాను తరువాత మీ ఇష్టం."

"వరదొచ్చేట్టుందిరోయ్!" పొలికేక.

"అదుగో నురుగు!"

"గంగమ్మతల్లీ, నీళ్ళనెలా ఒడ్డుచేరుస్తావో! నువ్వే దిక్కు తల్లీ! పిల్లా జల్లా, ఆడామగా, ముసలీముతకా తేడా లేకుండా జనాల్ని పొట్టన పెట్టుకునే గంగమ్మ తల్లీ. నువ్వే దిక్కు తల్లీ!"

ఫట్‌మని కొబ్బరికాయ పగిలింది. రామలింగం కొబ్బరి ఒప్పుల్ని నీళ్ళలోకి విసిరేస్తూ "నువ్వే దిక్కు తల్లీ! ఈత రాని అమ్మాయిల్ని నీ కప్పగించి వెళుతున్నాం. ఎలా ఒడ్డుకు చేరుస్తావో!" అన్నాడు.

"వెళ్ళొస్తామండీ. కళ్యాణిగారూ! సావిత్రిగారూ! శ్యామలగారూ! అలివేలుగారూ! మళ్ళీ మిమ్మల్ని చూస్తామో, చూళ్ళేమో! మిమ్మల్నెప్పుడైనా బాధించి ఉంటే మమ్మల్నందర్నీ దొకున క్షమించండి" అన్నాడు చంద్రమోహన్ గద్గదికంగా.

"ఇవే చివరి చూపులేమో! మీరు నలుగురూ ప్రక్క ప్రక్కన నుంచుంటే ఫోటో ఒకటి తీస్తాను" అంటూ రామలింగం కెమెరా అడ్జస్టు చేశాడు.

"రేపు పేపర్లో వెయ్యటానికైనా ఒకటి అవసరమే" అన్నాడు బుచ్చిబాబు.

"యింతకీ హెడ్డింగ్ ఏమి ఉండబోతుందో?"

"పిచ్చిగంగలో ఈతరాని అమ్మాయిల మునక — అంటే బాగుంటుంది కదూ?"

"ఛీ! ఛీ! ఛీ! ఏం బాగోలేదు. 'పిచ్చి గంగలో అమ్మాయిల మునక' చాలు. 'ఈతరాని' అక్కర్లేదు. ఈతవస్తే ఎందుకు మునుగుతారు?"

"ఛ! ఛ! ఛ! హెడ్డింగ్ బాగోలేదు. మునక అంటే తలస్నానం చెయ్యడం అనికూడ అర్థం వస్తుంది. 'పిచ్చిగంగలో అమ్మాయిల మునక' తర్వాత 'చావు' అనే పదాన్ని బ్రాకెట్లో పెట్టాలి."

"వీడు బ్రాకెట్టు లేంది ఉండలేడు. ఉన్నదంతా బ్రాకెట్లో పెట్టడం తప్ప వీడికేం తెలియదు— 'పిచ్చిగంగలో అమ్మాయిలు కొట్టుకుపోయారు' అంటే ఎలా వుందంటావ్?"

"అబ్బే! పిచ్చి గం..."

"అరవద్దండర్రా. అమ్మాయిలు ఎలా వణుకుతున్నారో చూడు'" అన్నాడు రామలింగం.

"మీ కందరికీ ఈత వచ్చునాండీ?" అడిగింది శ్యామల బేలగా

"నేను గోదావరి ఈదానండీ."

"బ్రాకెట్లో 'ఉక్కతోక పట్టుకుని'"

"నేను గంగానది ఈదానండీ. బ్రాకెట్లో ఏమీలేకుండానే" అన్నాడు సుబ్బారావు గర్వంగా.

ఇంతలో దూరంగా దుమ్ము రేగింది. ధూళి మేఘాలు ఆకాశమంతా కమ్ముకున్నాయి. "గుర్రపు డెక్కల చప్పుడు!" ఎవరో అన్నారు. "గాభరాపింగ్..." నూతిలోంచి వచ్చినట్లుందా మాట. అందరికీ గొంతు తడారిపోయింది. గజగజ ఒణుకుతున్నారు.

గుర్రపు డెక్కల చప్పుళ్ళు. ధూళి మేఘాలు శరవేగంతో దగ్గరవుతున్నాయి

ఎలా?.... ఎలా?

ప్రతివొక్కరిలో కంగారూ, ఆదుర్దా, భయం!

"మీరేం భయపడకండి!" ఉన్నట్లుండి ఓ కంచుకంఠం మ్రోగింది.

ఎవరా ఆపద్బాంధవుడు? ఎవరా అనాథ రక్షకుడు?

ఆ కంఠం చంద్రమోహన్‌ది. అతడు పరిస్థితుల్ని అదుపులోనికి తీసుకున్నాడు. అతడి ఆజ్ఞలకోసం తక్కినవాళ్ళంతా కాచుకున్నారు, "మీలో రన్నింగ్ రేస్‌లో ఫస్టు వచ్చినవాళ్ళెవరైనా ఉంటే ఇలా రండి."

ఇద్దరు ముందుకు వచ్చారు.

"మీరు కాలి సత్తువకొద్దీ ఇటువేపు




పరుగెత్తండి."

చంద్రమోహన్ తక్కినవాళ్ళ నుద్దేశించి "మీలో గజఈతగాళ్ళెవరైనా ఉంటే ముందుకు రండి" అంటుండగానే నలుగురు ముందుకు వచ్చారు

"మీ నలుగురూ ఏట్లోకి దూకి ప్రాణాల్ని కాపాడుకోండి."

మిగిలిన వాళ్ళవంక చూచి "మీలో డిగ్రీలో పాలిటిక్స్ తీసుకున్న వాళ్ళెవరైనా ఉంటే యిటురండి" అన్నారు చంద్రమోహన్.

అరడజను మంది వచ్చి "మేమేం చెయ్యాలి గురువుగారూ" అన్నారు అయోమయంగా.

"మీరంతా గాథరాపింగ్ కాళ్ళు పట్టుకోండి. వీలైతే వాడి గుర్రం కాళ్ళు కూడ. కాదంటే వాడి ముఠాలో చేరండి."

"ఏమండీ అందరికీ ఉపాయం చెబుతున్నారు. మేము అబలలం. మాకో?" అన్నారు ఆడవాళ్ళు. వాళ్ళు విపరీతంగా భయపడిపోతున్నారు.

"మీరు హిస్టరీ స్టూడెంట్సా?"

"లేదండీ" అన్నారు వాళ్ళు.

"కాకపోయినా మీకు ఇండియన్ హిస్టరీ తెలిసే వుంటుంది. మీరంతా చితి పేర్చుకుని ప్రాణత్యాగం చెయ్యండి. మన హిస్టరీ కూడ అదే చెబుతుంది."

"అగ్గిపెట్టె లేదండీ" అంది అలివేలు భోరున ఏడుస్తూ.

ఉన్నట్టుండి ఆ ప్రదేశమంతా గగ్గోలు లేచింది. ఎవరికివాళ్ళు చెల్లాచెదరయ్యారు. ఒక అరడజను గాడిదలు గుంపుగా వాళ్ల మధ్యలోంచి దూసుకుంటూ ముందుకు పరుగెత్తాయి. క్రిందపడ్డవాళ్లు దుమ్ము దులుపుకుంటూ లేచి "ఛీ! ఛీ! గాడిదలు!" అని తిట్టుకున్నారు.

"మేమంతా భయపడిపోతుంటే నువ్వింత ధైర్యంగా ఎలా వున్నావ్?" అని అందరూ ఆశ్చర్యపోతూ అడిగారు.

"వెరీ సింపుల్. మీరంతా కంగారులో వుంటే నేను చెట్టెక్కి చూశాను. వచ్చేది వాడు గాథరాపింగ్ కాదు, గార్దభసింగులని

ముందుగా తెలుసుకొని నేనేం గాభరా పడలేదు" చంద్రమోహన్ వివరించారు.

"మాకసలా ఐడియానే రాలేదోయ్" అంటూ చాలమంది చంద్రమోహాన్ని అభినందించారు.

"అదుగో గార్దభసింగ్!" ఉన్నట్లుండి ఎవరో అరిచారు.

అంతా అటువేపు చూచారు. ఒక గాడిద ఏట్లో నీళ్ళు త్రాగుతోంది. అందరూ గొల్లున నవ్వారు.

"మీరు మమ్మల్నంత కఠినంగా చితి పేర్చుకుని చావమన్నందుకు మొదట మాకు కోపం వచ్చినా, ఇప్పుడు తల్చు కుంటే నవ్వు వస్తోంది" అంది కళ్యాణి

"థాంక్స్!... మేము వెడుతున్నా మండీ, కళ్యాణిగారూ! మీరు తరువాత వస్తామన్నారుగా. పాపం! మీకు దారి తెలియదేమో? ఇక్కడ నుండి ఏరు దాటాలండీ.. అలా వెడితే లోతు తక్కువ... ప్రక్కలకు వెళ్ళారమకోండి మునిగిపోతారు—"

"వద్దండీ. మాకు భయం. మీ వెనకే వస్తాం" అంది సావిత్రి.

"సరే, రండి!"

"అయితే ఒక రిక్వెస్టు... ఏరు దాటేప్పుడు మీరు వెనక్కి తిరిగి చూడ రాదు."

ముందు జంట్స్ ఏట్లోకి దిగారు. వాళ్ళ వెనుక లేడీస్ దిగారు. ఏటినడుమ లోతు ఎక్కువగా ఉంది. లేడీస్ సట్ట నడుమకు వచ్చాక—

"ఏమండీ, అంతా వస్తున్నారా?" అన్నాడు చంద్రమోహన్.

"ప్లీజ్! వెనక్కి తిరక్కండి. వస్తు న్నాము" లేడీస్ కంగారుగా అరిచారు.

ఏరుదాటి ఒడ్డున చేరిన లేడీస్‌ని చూచి జంట్స్ ఆశ్చర్యంగా "బట్టలు తడవకుండా ఎలా దాటారండీ" అన్నారు.

ఆడవాళ్ళు ముసిముసి నవ్వులు నవ్వు కున్నారు. "అది అలివేలు టెక్నిక్" అంది కళ్యాణి.

"మీ టెక్నిక్ కాస్త ఈ కెమెరాలో క్లిక్ అయింది" అన్నాడు రామలింగం.

లేడీస్ కొయ్యబారిపోయారు.

"అల్పే కడిగించి తలో కాపీ పంచి పెడతా" అన్నాడు రామలింగం.

లేడీస్ రామలింగంపైకి ఎగబడ్డారు. ఐక్కప్రాణి రామలింగం వెల్లకిలా పడ్డాడు. లేడీస్ కెమెరా లాక్కొని ఫిల్మ్‌ని ఏట్లోకి గిరాటేశారు. రామలిం మూలుగుతూ దుమ్ము దులుపుకుంటూ లేవ లేక లేస్తుంటే ఎవరో "ఫస్టెయిడ్ బాక్స్" అంటూ కేకేశారు.

రా మ లిం గం దోక్కుపోయిన మోచేతులు చూచుకుంటూ "వస్తాదుల్లా ఉన్నారు" అంటుంటే అంతా గొల్లున నవ్వారు.